క్లుప్తంగా

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.15, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 50, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 50, పచ్చకాకర 35, పందిరిబీర 45, క్యాబేజీ 10, క్యారెట్ 21, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 23, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 20, చామగడ్డ 65, మొరంగడ్డ 23, కందగడ్డ 33, సొరకాయ 15, పొట్లకాయ18, అరటికాయ 9 (ఒకటి), మునగకాయ 4–6, ముల్లంగి 3–5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల అమలులో ఉంటాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కంటోన్మెంట్: చెట్ల కొమ్మల తొలగింపు, ఫీడర్ల మరమ్మతుల కారణంగా కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు.. ఆర్‌పీ నిలయం సబ్ స్టేషన్ పరిధిలోని నాగదేవత ఫీడర్ ప్రాంతాలు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సరస్వతి నగర్ ఫీడర్ పరిధితో పాటు వెంకటాపురం ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలన్నారు.

11, 12 తేదీల్లో రాష్ట్రస్థాయి ఫిస్ట్ బాల్ పోటీలు

కంటోన్మెంట్: శ్రీపతి వెంకటరావు మెమోరియల్ రాష్ట్రస్థాయి ఫిస్ట్ బాల్ పోటీలు ఈ నెల 11,12 తేదీల్లో నిర్వహించనున్నట్లు కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్, స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్‌తో కలిసి శ్రీపతి రఘుచరణ్, ఫిస్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ కొమ్ము వెంకట్ వివరాలు వెల్లడించారు. గత నాలుగేళ్ల క్రితం ప్రారంభమైన ఫిస్ట్‌బాల్‌కు మంచి ఆదరణ లభిస్తోందని జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రభుకుమార్ గౌడ్, సత్యనారాయణ, జగదీష్, విక్రమ్, హోప్ విజయ్ వరప్రసాద్, మహేందర్, షకీబ్ పాల్గొన్నారు.

రేపు బోర్డు పాలకమండలి సమావేశం

కంటోన్మెంట్: ఎట్టకేలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలకమండలి సమావేశం ఖరారైంది. కంటోన్మెంట్ బోర్డు సమావేశం శుక్రవారం జరగనుందని అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు. గత నెల 6న జరగాల్సి ఉండగా తొలుత మరుసటి రోజుకి, తర్వాత నిరవధికంగా వాయిదా పడింది. కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేసే ప్రక్రియలో భాగంగా కేంద్రం ఎనిమిది మంది సభ్యులతో కూడిన కమిటీ ఏర్పాటు చేసింది. బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్, సీఈఓ మధుకర్ నాయక్ ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఫిబ్రవరి నాలుగో తేదీలోపు నివేదిక సమర్పించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బోర్డు సమావేశం వాయిదా పడుతూ వచ్చింది. బోర్డు అధ్యక్షుడు సోమశంకర్ సెలవులో ఉండటంతో కూడా సమావేశం తేదీ ఖరారు చేయడంలో ఆలస్యం జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుత వేరీడ్ బోర్డు పదవీకాలం ఈ నెల 10వ తేదీతో ముగియనుండగా, కేంద్రం మరో ఆరు నెలలు పొడగించింది. ఈ క్రమంలోనే శుక్రవారం బోర్డు సమావేశం నిర్వహిస్తుండటం గమనార్హం.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం



మాట్లాడుతున్న బాలు

ఉస్మానియా యూనివర్సిటీ: టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ప్రగతి భవనంపై చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు తుంగబాలు పేర్కొన్నారు. బుధవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ అభివృద్ధిని చూసి ఇక కాంగ్రెస్‌కు రాజకీయ భవిష్యత్ ఉండదనే అక్కస్సుతో నక్సలైట్ల పేరును వాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నక్సలైట్ల విమర్శలకు సైతం తావులేకుండా అభివృద్ధి, శాంతియుతమైన పాలనను చూసి ఓర్వలేక ప్రగతి భవనాన్ని పేల్చి వేయాలని రేవంత్‌రెడ్డి తీవ్రవాదిగా వ్యాఖ్యానించడం సిగ్గుచేటు అన్నారు. ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలన్నారు.

అందె కిష్టయ్యకు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ తెలుగు శాఖలో అందె కిష్టయ్యకు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ప్రొ.ఎస్ఆర్ వెంకటేశం పర్యవేక్షణలో తెలంగాణ ఉద్యమంలో సాహితి సాంస్కృతిక సంస్థల పాత్ర ఒక పరిశీలన అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీని పొందారు.

జనావాసాల మధ్య ఉన్న గోదాంలను తరలిస్తాం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- రెండ్రోజుల్లో ఇళ్లలోకి వెళ్లొచ్చని కాచిబోలి వాసులకు భరోసా



కాచిబోలిలో పర్యటిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్: జనావాసాల మధ్య ప్రమాదకరంగా ఉన్న గోదాంలను వెంటనే తరలిస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి మినిస్టర్ రోడ్‌లోని దక్కన్ బిల్డింగ్ పరిసర ప్రాంతాలల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దక్కన్ బిల్డింగ్‌లో జరిగిన ప్రమాదం పెద్దదని తాను ఇప్పటి వరకు ఇలాంటి పెద్ద ప్రమాదం చూడలేదన్నారు. జనావాసాల మధ్య, రసాయనాలు అగ్ని ప్రమాదాలు జరిగే అస్కారం ఉండి ప్రజలకు హాని కలిగించే గోదాముల పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అగ్ని ప్రమాదానికి గురైన భవనాన్ని మరో రెండ్రోజుల్లో పూర్తిగా నేలమట్టం చేస్తామని వెల్లడించారు. చనిపోయిన ముగ్గురు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించామని చుట్టు పక్కల భవనాలకు నష్టం వాటిల్లకుండా రూ.41 లక్షల వెచ్చించి అధునాతన యంత్రాలతో కూల్చివేతలు చేపట్టామని గుర్తు చేశారు. మంత్రి వెంట ఆర్డీవో వసంత కుమారి, తహసీల్దార్ శైలజ, ఉప కమిషనర్ ముకుందొరెడ్డి, ఈఈ సుదర్శన్, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ ఉన్నారు.

బస్తీ ప్రజలకు భరోసా..

మంత్రి శ్రీనివాస్ యాదవ్ దక్కన్ బిల్డింగ్‌ను ఆనుకుని ఉన్న కాచిబోలి బస్తీకి వెళ్లి 15 కుటుంబాలతో మాట్లాడారు. వారికి అన్ని విధాల సహకారం అందిస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. 20 రోజుల పాటు ఇంటికి దూరంగా ఉంటూ ఎన్నో ఇబ్బందుల పడుతూ ఓపికతో ఉన్నందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. మరో రెండ్రోజుల్లోనే మీమీ ఇళ్లలోకి రావచ్చని సూచించారు. బీటలు వాలిన ఇళ్లకు పూర్తిగా మరమ్మతులు చేయాలని, ఇళ్ల మీద కాలిపోయిన సింటెక్స్ ట్యాంకుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులను ఆదేశించారు. కూలిపోయిన ప్రహరీ నిర్మించాలని, ఇళ్లపై ధ్వంసమైన రేకులను తొలగించి కొత్తవి వేయాలన్నారు. బస్తీలో మరో 20 ఏళ్ల వరకు డ్రైనేజీ, సీసీ రోడ్లు, మంచినీటి సమస్యలు రాకుండా కొత్తగా నిర్మించాలని అధికారులను ఆదేశించారు.



గగన్ ప్యారడైజ్ వాసులతో మాట్లాడుతూ..

గగన్‌ప్యారడైజ్ అపార్ట్‌మెంట్ వాసులతో..

అనంతరం మంత్రి శ్రీనివాస్‌యాదవ్ భవనం వెనుక వైపు ఉన్న గగన్‌ప్యారడైజ్ అపార్ట్‌మెంట్‌కు వెళ్లారు. 30 కుటుంబాలకు చెందిన తాము 20 రోజుల నుంచి హోటల్‌లో ఉంటున్నామని తమ గురించి ఎవరు పట్టించుకోలేదని మంత్రి దృష్టికి తెచ్చారు. ఇందులో పేద వాళ్లు ఎవరో గుర్తిస్తే సహాయం చేస్తామని మంత్రి చెప్పగా అందరూ మధ్యతరగతి ప్రజలమని చెప్పారు. 20 రోజులుగా తాము రోజు రూ.1500 చెల్లించి హోటళ్లలో ఉంటున్నామని ఒక్కో కుటుంబానికి రూ.50 వేల దాకా ఖర్చు అయిందని వాపోయారు. ఇక్కడ వరద నీటి సమస్య తీవ్రంగా ఉండగా నేనే పరిష్కరించానని కానీ.. మీరేమో ఓట్లు మాత్రం మరో పార్టీకి వేస్తారని అసహనం వ్యక్తం చేశారు. అనంతరం అపార్ట్‌మెంట్ లోపల పడిన శిథిలాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. బాధలో ఉన్న తమను ఓదార్చాలి మంత్రి ఇలా మాట్లాడతారా.. అంటూ అపార్ట్‌మెంట్ వాసులు చర్చించుకున్నారు.

అపార్టుమెంట్ పెంట్‌హౌస్‌లో అగ్నిప్రమాదం



స్థానికులతో మాట్లాడుతున్న మోతే శ్రీలతశోభన్‌రెడ్డి

లాలాపేట: తార్నాక సండేమార్కెట్ ప్రాంతంలోని సాయి సంతోషి అపార్టుమెంట్ పెంట్‌హౌస్‌లో బుధవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. పొగ, మంటలు చూసిన అపార్టుమెంట్ వాసులు భయంతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేశారు. రెండు గదుల్లో ఉన్న ఫర్నీచర్, మంచాలు, బీరువా, ఇతర సామగ్రి కాలిపోయాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ట్రాన్స్‌ఫార్మర్‌పై ఓవర్ లోడ్ కారణంగా షాట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు ప్రాథమికంగా తెలిసింది. అగ్నిప్రమాదం జరిగినట్లు తెలుసుకున్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి, అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. భవనంపై ఉన్న పెంట్‌హౌస్‌కు అనుమతి లేదని అగ్నిప్రమాదంలో దెబ్బతిన్న పెంట్‌హౌస్‌ను పూర్తిగా కూల్చివేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఆదేశాలిచ్చారు. బహుళ అంతస్తుల యజమానులు, గోదాముల నిర్వాహకులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతూ అగ్ని ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ దశరథ్ బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి వీరన్న ఘటనా స్థలాన్ని చేరుకుని అక్కడి పరిస్థితులపై సమీక్షించారు.

రైల్ నిలయం పాత క్వార్టర్స్‌లో..

అడ్డగుట్ట: సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంకు చెందిన పాత క్వార్టర్స్‌లో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రస్తుతం పాత క్వార్టర్స్‌లో ఎవరూ ఉండకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అక్కడ పేరుకుపోయిన చెత్తపై గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ వేయడంతో నిప్పంటుకొని భారీగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో రెండు ఫైర్ ఇంజన్లు వచ్చి మంటలను అదుపు చేశాయి. దక్షిణ మధ్య రైల్వే డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్మిత ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు.

రామకృష్ణపై సీబీఐకి ఫిర్యాదు చేస్తా

బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేశవరెడ్డి

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అవినీతిపై సీబీఐకి ఫిర్యాదు చేస్తానని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామకృష్ణ అవినీతి చిట్టా సిద్ధం చేశానని త్వరలోనే ఆధారాలతో సహా సీబీఐకి ఫిర్యాదు చేస్తానని వెల్లడించారు. తాను 12 ఏళ్ల పాటు ప్రాతినిథ్యం వహించిన రెండో వార్డులో అభివృద్ధి విషయంలో రామకృష్ణ ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తన చిత్తశుద్ధిని ప్రశ్నించే ముందు రామకృష్ణ తన ఐదో వార్డులో పనుల పట్ల శ్రద్ధ చూపితే మంచిదన్నారు. తాను బోర్డు ఉపాధ్యక్షుడిగా ఉన్న సమయంలో టీపీటీ బకాయిలు పూర్తిగా వసూలు చేశానని, సర్వీసు చార్జీలు సైతం పెద్ద మొత్తంలో తెప్పించానన్నారు. ప్రస్తుతం రూ.700 కోట్లు దాటిన సర్వీసు ఛార్జీల బకాయిల విడుదల కోసం రామకృష్ణ చేస్తున్న ప్రయత్నాలు శూన్యమన్నారు. రెండో వార్డులో బోర్డు ఎన్నికలకు సంబంధించి సుమారు 25 వేల ఓట్లు తొలగించడం పట్ల తాను అప్పట్లోనే తీవ్ర ఆందోళన చేపట్టానని అన్నారు. తొలగించిన ఓటర్లకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో భవిష్యత్‌లో ఇబ్బందులు పెడతారని అధికారుల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ఈ విషయంలో ఏనాడూ మాట్లాడని రామకృష్ణ, ఇప్పుడు తనపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. రామకృష్ణ చర్యలపై బీజేపీ అధిష్టానానికి కూడా ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నారు.

సెయింట్ పీటర్స్‌కు గ్రీన్ చాంపియన్ అవార్డు

కంటోన్మెంట్: 'కన్జర్వ్‌మై ప్లానెట్' పేరిట స్నీడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఫౌండేషన్ (ఎస్ఈఐఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన హైదరాబాద్ గ్రీన్ చాంపియన్‌లో బోయిన్‌పల్లికి చెందిన సెయింట్ పీటర్స్ చాంపియన్‌గా నిలిచింది. సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 200 పాఠశాలలు పాల్గొనగా ఫైనల్స్‌కు ఐదు పాఠశాలలు ఎంపికయ్యాయి. సెయింట్ పీటర్స్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు ఉత్తమంగా నిలిచింది. ఎస్ఈఐఎఫ్ అనే సంస్థ పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా కన్జర్వ్ మై ప్లానెట్ పేరిట విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా పలు కాంపిటీషన్లను నిర్వహిస్తోంది. కన్జర్వ్ మై ప్లానెట్ కాంపిటీషన్‌లో ఉత్తమంగా నిలిచిన స్కూలు విద్యార్థులకు కరస్పాండెంట్ టీపీ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ పిలుపునిచ్చారు. బుధవారం బోయిన్‌పల్లి పోస్ట్ మాస్టర్ బాలయ్యతో కలిసి ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రెండు రోజుల పాటు కొనసాగే ఆధార్ కేంద్రంలో ఆధార్ నమోదు, చిరునామా మార్పు తదితర సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది, స్థానికులు వరప్రసాద్, షకీబ్, మహేందర్, గణేష్, ముకేశ్ యాదవ్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

టైప్‌రైటింగ్ ఫలితాల విడుదలపై హర్షం



మహ్మద్ మసూద్ అలీ

లాలాపేట: తెలంగాణ వ్యాప్తంగా గత నెలలో జరిగిన టైప్ రైటింగ్, షార్ట్‌హాండ్ పరీక్షల ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. అంబికా టైప్ ఇనిస్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ టైప్ రైటింగ్ షార్ట్ హాండ్ అండ్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్(టీటీఎస్‌సీఐఏ) జనరల్ సెక్రటరీ మహ్మద్ మసూద్ అలీ మాట్లాడారు. ఫలితాలను తొందరగా విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. హైకోర్టులో కోర్టు మాస్టర్, టైపిస్టు, కాపియిస్టు తదితర ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 11న ఉన్న నేపథ్యంలో నోటిఫికేషన్‌ను దృష్టిలో పెట్టుకుని ఫలితాలను తొందరగా ప్రకటించాలని తమ అసోసియేషన్ అభ్యర్థనను పరిగణించి 17 రోజుల్లోనే ఫలితాలు ప్రకటించడం అభినందనీయమన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

అమీర్‌పేట: ఫుట్‌పాత్‌పై ఉంటూ అనారోగ్యానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 5న అమీర్‌పేట కృతుంగా హోటల్ సమీపంలోని ఫుట్‌పాత్‌పై ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి వచ్చి చూడగా అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించి గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

వ్యక్తి అదృశ్యం

చిలకలగూడ: ఇంటి నుంచి వెళ్లి వ్యక్తి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ నరేష్ వివరాల ప్రకారం.. వారాసిగూడ షాబాద్‌గూడకు చెందిన అబ్దుల్‌రవూఫ్ (40)కు 2004లో రుహెనబేగంలో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు. కొన్నిరోజులుగా ఢిల్లీకి చెందిన ఓ మహిళతో సన్నిహితంగా ఉండటంతో కుటుంబ సభ్యులు రవూఫ్‌కు కౌన్సెలింగ్ ఇప్పించారు. ఈ నెల 6న ఇంటి నుంచి బయటకు వెళ్లిన రవూఫ్ ఎంతకీ తిరిగిరాకపోవడంతో బుధవారం భార్య ఫిర్యాదు చేసింది.

అక్రమ అరెస్టులు తగవు



శ్రీనివాస్‌మాదిగ

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థులు, అధ్యాపకుల అక్రమ అరెస్టులపై ఎమ్మార్పీఎస్–టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వేచ్ఛయుత వాతావరణంలో చదివే విద్యార్థులు అప్పుడప్పుడు హక్కుల కోసం క్యాంపస్‌లో సభలు, సమావేశాలపై నిషేధం, ఆందోళనలు చేయకుండా నిర్బంధాలు విధించడం సిగ్గుచేటన్నారు. పేద విద్యార్థులకు న్యాయమైన విద్య అందాలనే ఆరాటంతో రాష్ట్రంలోని వర్సిటీల్లో ఖాళీగా అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేయాలని దీక్ష చేపట్టిన ప్రొ.కాశీంను, మద్దతుగా నిలిచిన విద్యార్థులను బలవంతంగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ప్రొ. కాశీం, విద్యార్థి నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

చెరువులో గల్లంతై శవమై తేలాడు

మూడ్రోజులకు దొరికిన మృతదేహం



జహంగీర్(ఫైల్)

బన్సీలాల్‌పేట్: సరదా కోసం చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి గల్లంతై మూడ్రోజుల తర్వాత శవమై తేలాడు. ఈ నెల 6 బన్సీలాల్‌పేట్ డివిజన్ జయప్రకాష్ నగర్ ప్రాంతానికి చెందిన షేక్ జహంగీర్(45) స్నేహితులతో కలిసి షామీర్‌పేట్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. ముందుగా జహంగీర్ చెరువులోకి వెళ్లి ఎంతకు తిరిగి రాలేదు. మృతుడిని కాపాడటానికి సోదరుడు చోటన్ చెరువులోకి కొద్ది దూరం వెళ్లినా ఫలితం లేకుండా పోయింది. మూడ్రోజుల పాటు కుటుంబీకులు, పోలీసుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. షామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుధీర్ కుమార్, ఎస్.ఐ శేఖర్, హెడ్ కానిస్టేబుల్ ఫారూఖ్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది గోపాల్, లాలా, మీనా శ్రమించి ఎట్టకేలకు జహంగీర్ మృతదేహాన్ని బుధవారం చెరువులో నుంచి బయటకు తీసుకువచ్చారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి



జెడ్సీ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సీతాఫల్‌మండి: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో పెండింగ్‌లో పనులను సత్వరమే పూర్తి చేయాలని కార్పొరేటర్ సామల హేమ కోరారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ అధికారులతో సమావేశమైన ఆమె బుధవారం జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని టీఆర్‌టీ క్వార్టర్స్, బీదల బస్తీ, మేడిబావి, చిలకలగూడ, శ్రీనివాస్‌నగర్ ప్రాంతాల్లోని పార్కులు, మైదానాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదన్నారు. మహ్మద్‌గూడ నాలాకు రిటైనింగ్‌వాల్ నిర్మాణం పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కారణంగా ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతున్న తీరును జోనల్ కమిషనర్ దృష్టికి తెచ్చారు. 9 ప్రాంతాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం కోసం రూ. 4 కోట్లు కేటాయించినప్పటికీ పనులు ప్రారంభం కాలేదన్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్లు ప్రమాదకర పరిస్థితులకు చేరకముందే కొత్త రోడ్లు నిర్మించాలని కోరారు. స్థానికుల విజ్ఞప్తిమేరకు పాఠశాలలు నెలకొని ఉన్న ప్రాంతాల్లో రహదారులపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతిలో కోరారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ జోనల్ ఎస్ఈ అనిల్ రాజ్, ఈఈ ఆశాలత, ఏఈ కౌశిక్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలి



ధర్నాలో పాల్గొన్న లోకో రన్నింగ్ సిబ్బంది

అడ్డగుట్ట: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శర్మ డిమాండ్ చేశారు. లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలను రైల్వే బోర్డు పరిష్కరించాలని బుధవారం సికింద్రాబాద్‌లోని సంచాలన్ భవన్ ఎదుట చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఖాళీగా ఉన్న లోకో రన్నింగ్ సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జోన్‌లో ప్రస్తుతం 327 ఖాళీలు ఉన్నాయని ప్రమోషన్లు ఆమోదించడంలో కూడా విపరీతమైన జాప్యం జరుగుతుందని ఆరోపించారు. 46 గంటల వారాంతపు విశ్రాంతిని అమలు చేసి, వరుస రాత్రి డ్యూటీలను రెండు రోజులకు పరిమితం చేయాలని కోరారు. అడ్‌హాక్ ప్రమోషన్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీని బలోపేతం చేస్తాం



సమావేశమైన బీజేపీ నాయకులు

అమీర్‌పేట: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేస్తామని సికింద్రాబాద్ మహంకాళీ నియోజకవర్గం బీజేపీ అధ్యక్షులు బూర్గుల శ్యామ్‌సుందర్‌గౌడ్ అన్నారు. బుధవారం అమీర్‌పేట పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో స్ట్రీట్‌కార్నర్ సమావేశాలు, బూత్ కమిటీలు చేపడతామన్నారు. క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని ఆసక్తి ఉన్న యువతీ, యువకుల వివరాలను సేకరించి పార్టీ కార్యాలయానికి పంపాలని కార్యకర్తలకు సూచించారు.ఈ కార్యక్రమంలో మేకల సారంగపాణి,పెద్ది రవి, శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

పెరుమాల్ దేవాలయంలో ప్రత్యేక పూజలు

రాంగోపాల్‌పేట్: శివాజీనగర్‌లోని పెరుమాళ్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం కనిగిరి మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చరిత్రతో పాటు తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగే విధంగా పూజ విధానం జరుగుతుందని ఆలయ అర్చకులు ఆయనకు వివరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వై నర్సారెడ్డి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.



దేవాలయానికి వచ్చిన ఉగ్ర నరసింహారెడ్డి

విద్యార్థులకు సామాజిక బాధ్యత ఉండాలి



బహుమతులు అందజేసిన కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్

బన్సీలాల్‌పేట్: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సికింద్రాబాద్ బోట్స్‌క్లబ్ సమీపంలోని యూత్ హాస్టల్ ప్రాంగణంలో బుధవారం ప్రజా సమస్యలపై విద్యార్థుల ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సునంద, యూనిసెఫ్ స్టేట్ మేనేజర్ డేవిడ్‌రాజ్, ఎన్‌వైకే అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్, బస్వారాజ్ పాల్గొని మాట్లాడారు. నిత్యజీవితంలో ఎదురయ్యే సమస్యలపై విద్యార్థులు ప్రెజెంటేషన్ ఎంతో అద్భుతంగా ఉందన్నారు. రోడ్లు, డ్రైనేజీ, సీసీ కెమెరాల ఏర్పాటు, స్కూల్‌లో మరుగుదొడ్ల దుస్థితి ఇతరత్రా సమస్యలపై చిన్నారుల స్పందన ఆకట్టుకుంది. విద్యార్థులు సూచించిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఇంద్రధనస్సు బాలల సంఘం, అప్స సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శోభ, రాజేశ్వరి, విద్యార్థులు, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు



లాలాపేట: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తోందని ఉస్మానియా యూనివర్సిటీ ఉమెన్స్ హాస్టల్ మాజీ జాయింట్ డైరెక్టర్ కళ్యాణి లక్ష్మీ పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన తార్నాక, మేడిపల్లి శ్రీ చైతన్య పాఠశాలల వార్షికోత్సవం వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏజీఎం సతీష్, ఎగ్జిక్యూటివ్ డీన్ సనమ్‌జీ, జోనల్ కోఆర్డినేటర్స్ రాజేంద్రప్రసాద్, సుధా, తార్నాక, మేడిపల్లి ప్రిన్సిపాల్స్ ప్రశాంతి, దయాకర్, డీన్లు మహిపాల్‌రెడ్డి, మధుకర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు



చెక్కులు అందజేస్తున్న శ్రీలతాశోభన్‌రెడ్డి

లాలాపేట: పేద, మధ్యతరగతి ప్రజలు మెరుగైన వైద్యం పొందేందుకు సీఎంఆర్ఎఫ్ దోహదపడుతుందని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. పలువురికి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను బుధవారం ఆమె తార్నాకలోని తన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సీఎం కేసీఆర్ భరోసా కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, అంజన్న, బాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని సన్నిహిత బాలికల హోంలో బుధవారం మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది బాలికలకు సాధారణ, కంటి, పంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, పంపిణీ చేశారు. హోం లోని పిల్లల ఆరోగ్య సంరక్షణకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందించిన హాస్పిటల్ బృందానికి హోం డైరెక్టర్ ఉషారాణి అభినందనలు తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు శ్రావణి, శ్రేయ, దిలీప్, అమీనా, వైష్ణవి, నర్స్ అంజలి, మేనేజర్ సంజయ్ పాల్గొన్నారు.

చెక్కుల అందజేత

కంటోన్మెంట్: నిరుపేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ సంజీవనిలా ఆదుకుంటోందని బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి (జెఎమ్మార్) ఆధ్వర్యంలో బోయినపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో బోయినపల్లి కడక్‌పురకు చెందిన సర్వర్‌కు రూ. 60 వేలు, బాపూజీనగర్‌కు చెందిన శ్రీ.ఎస్.శంకర్‌కు మంజూరైన రూ.18 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు.

కంటి వెలుగు కేంద్రం సందర్శన



శిబిరాన్ని సందర్శించిన ఏఎంసీ దయానంద్

పద్మారావునగర్: కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ దయానంద్ అన్నారు. ఐడీహెచ్ కాలనీలోని కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించి అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి సమస్యలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా అద్దాలతో పాటు ఆపరేషన్లు సైతం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంతి, సిబ్బంది పుష్ప, రాఘవమ్మ, ఎల్. వెంకటేశ్ పాల్గొన్నారు.